క్లుప్తంగా

అమరవీరులకు జోహార్లు



ఉమేష్‌చంద్ర చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న పోలీసులు

మంత్రాలయం: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఐపీఎస్ ఉమేష్‌చంద్ర చిత్ర పటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక శక్తులను, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునే ప్రయత్నంలో ఎందరో పోలీసులు ప్రాణాలు విడిచారని గుర్తు చేశారు. అమరవీరులను స్మరించుకోవడం పౌరులు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆనంద్‌రెడ్డి, హెచ్‌కానిస్టేబుళ్లు కృష్ణ, బసప్ప, కానిస్టేబుళ్లు లక్ష్మణ్‌గౌడ్, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వాయుపుత్రునికి పూజలు

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు.

చురుగ్గా ఎస్‌ఎస్ ట్యాంకు మరమ్మతు పనులు

ఆదోనిటౌన్: బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ.55 లక్షలతో తాత్కాలిక నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శనివారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డీఈలు, ఏఈలు పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

ఆదోనిటౌన్: పట్టణంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం 4వ వార్డులో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన భవనాన్ని జేసీబీతో కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి కట్టడమైనా కూల్చివేసి, సంబంధిత యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ నియమ, నిబంధనల మేరకు భవంతుల నిర్మాణ సమయంలో అనుమతులు తీసుకోవాలన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక మృతిచెందాడు. బంధువులు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని బీఎస్ టాకీస్ వెనుక నివాసముంటున్న బేల్దార్ లక్ష్మన్న(39) శుక్రవారం అతిగా మద్యం తాగాడు. అదే మత్తులో పురుగు మందు తాగి అపస్మారకస్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

మంత్రాలయం: ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. శనివారం రాత్రి మండల పరిధిలోని వి.తిమ్మాపురం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని సూచించారు. తక్కువ ధరకే వస్తువులు ఇస్తామని, క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు మంజూరయ్యాయంటూ వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దన్నారు. గ్రామంలో అందరూ సోదర భావంతో జీవించాలని దసరా పండుగను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని సూచించారు.

చెరువుకు మరమ్మతులు చేపట్టండి

ఆదోని రూరల్: ఆస్పరి మండలం చిన్నహోతూరు చెరువుకు మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, సహాయ కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. శనివారం రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం అధిక వర్షాలకు చిన్నహోతూరు చెరువు గండి పడి వర్షపునీరు బయటికి వెళ్లి పోయాయన్నారు. ఆ తర్వాత రూ.1.20 కోట్లు మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందని, కొంతవరకు పనులు ప్రారంభించి, ఆ తర్వాత నిలిపేశారని తెలిపారు. అధికారులు స్పందించి పనులు పునఃప్రారంభించి గండిని పూడ్చి మూసానపల్లి, చిన్నహోతూరు, చిగిలి గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

జగన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు విశేష స్పందన వస్తోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి వ్యాధి గ్రస్తులను గుర్తించి వైద్య శిబిరాలపై సమాచారం ఇవ్వడంతో వారు హాజరై వైద్యం చేయించుకుంటున్నారు. శనివారం ఆదోని, మంత్రాలయం నియోజవర్గాల్లో నిర్వహించిన వైద్య సేవలకు ప్రజలు భారీగా హాజరయ్యారు. వారికి స్పెషలిస్ట్ డాక్టర్లు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.



ఆదోనిలో వైద్యపరీక్షల కోసం క్యూలో ఉన్న ప్రజలు





మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఇంటి వద్దకే వైద్యం

ఆదోని టౌన్: ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తోందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం అనంత మంగళ ఆంజనేయస్వామి కళ్యాణ మండపం, హవన్నపేటలోని మున్సిపల్ హైస్కూల్, క్రాంతినగర్ ఆంజనేయస్వామి కళ్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఒక్కో శిబిరంలో ఆరుగురు స్పెషలిస్ట్ డాక్టర్లతోపాటు 12 మంది స్థానిక వైద్యులు హాజరై ప్రజలకు బీపీ, షుగర్, రక్త, డెంగీ, మలేరియా, ఈసీజీ, టైఫాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేశారు. మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

గణేకల్‌లో..

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ గీతావాణి పరిశీలించారు. వైద్యులు నిసిగ్రేస్, వై.అంకబాబు, గీత, శేఖర్ పాల్గొని 600 మందికి పైగా రోగులను పరీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీడీఓ పరిశీలించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారమ్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఫార్మాసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆర్లబండలో..

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో డాక్టర్లు నజీర్ అహ్మద్, రజిత పాల్గొని 374 మందికి వైద్య సేవలు అందించారు. కాళ్ల నొప్పులు, గుండె పోటు, రక్త పరీక్షలు, బీపీ, హెచ్‌బీ, గర్భిణులకు, వృద్ధులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తాయమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్లబండలో బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

కౌతాళంలో

కౌతాళం: మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. పలువురు డాక్టర్లు హాజరై ప్రజలకు వివిధ పరీక్షలు నిర్వహించారు. కొందరికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి కర్నూలు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారాజు, సర్పంచ్ తులసమ్మ, వైఎస్సార్‌సీసీ నాయకుడు ఏకాంబర్‌రెడ్డి, డాక్టర్ ఇమ్మానుయల్, సుజాత, షానవాజ్ మానస, కార్యదర్శి అబ్దుల్‌వహిద్, మాజీ సర్పంచ్ పెద్ద లింగన్న, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు

బాధితులకు బాసటగా సీఎం వైఎస్ జగన్

- శుక్రవారం 6గురికి, శనివారం మరో 6గురికి ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ

కర్నూలు(సెంట్రల్): అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సాయం కోసం వచ్చిన బాధితులకు సీఎం వైఎస్ జగన్ బాసటగా నిలిచారు. ఈనెల 19న ఎమ్మిగనూరుకు వచ్చిన సీఎంను హెలిప్యాడ్‌లో పలువురు బాధితులు వైద్య సహాయం, ఆర్థిక చేయాలని విన్నవించారు. వారి కష్టాలను చూసి చలించిన ఆయన తక్షణమే ఆదుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగా కలెక్టర్ మొత్తం 12మందికి ఆర్థిక సాయం అందించారు. ఇందులో 11మందికి లక్ష చొప్పున ఇవ్వగా, ఒక్కరికి రూ.50 వేల చెక్కు అందజేశారు. 12మందిలో శుక్రవారం ఆరుగురికి, శనివారం మరో ఆరుగురికి కలెక్టర్ తన చాంబరులో చెక్కులను అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూధన రావు పాల్గొన్నారు.



- కర్నూలు జిల్లా ఆదోని మండలం కల్లుబావికి చెందిన పీఎస్ ఓబులేసూ కూలిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓ ప్రమాదంలో ఆయనకు కూడి కాలు దెబ్బతినడంతో ఆపరేషన్ కోసం రూ.5 లక్షలు ఖర్చు అయి ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. ఆర్థిక సాయం కోసం సీఎం వైఎస్ జగన్‌కు విన్నవించుకోగా కలెక్టర్ తక్షణ సాయంగా లక్ష రూపాయల చెక్కును అందజేశారు.



- ఆదోని మండలం కల్లుబావికి చెందిన పీఎస్ శాంతి ప్రమాదంలో ఒక చేయిని కోల్పోయి వికలాంగురాలుగా మారిపోయింది. వైద్యం, కుటుంబ ఖర్చుల కోసం ఆర్థిక పరిస్థితులు ఏమి బాగలేకపోవడంతో ఎంబీఏ చదివినా ఇంటి దగ్గరే ఉండాల్సి వస్తోంది. ఈక్రమంలో ఆమె సీఎంను కలసి ఆర్థిక సాయంతోపాటు ఉద్యోగం ఇవ్వాలని కోరడంతో కలెక్టర్ తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందజేశారు.





త్వరలో కోసిగిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు

కోసిగి: మండల కేంద్రంలో త్వరలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ ఏడీఈఎన్ రమణ రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజులు తెలిపారు. శనివారం కోసిగి రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటుపై రైల్వే, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులతో కలిసి బ్రిడ్జ్ నమూనా ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. బ్రిడ్జ్ ఏర్పాటుపై అభ్యంతరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే గేటును మూసివేసి అదే ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. చెన్నై నుంచి ముంబయి ప్రధాన రైల్వే మార్గం కావడంతో రోజూ దాదాపు 80 కి పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ప్రతి పదిహేను నిమిషాలకోసారి రైల్వే గేటు వేయాల్సి వస్తోందని, తద్వారా గేటు మీదుగా ఉరుకుంద ఈరన్న క్షేత్రం, ఇటు వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు విన్నవించారు. వారి వెంట రైల్వే గుంతకల్లు సెక్షన్ ఆఫీసర్ టీవీ ఎస్‌ఎస్ సత్యనారాయణ, ట్రాన్స్‌కో డీఈ చంద్రశేఖర్, ఏఈ వీరేష్, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సాయిసురేష్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు మాణిక్యరాజు, హొళగుంద కోసిగయ్య, ఎరుకుల లక్ష్మన్న, రాజేష్‌లు పాల్గొన్నారు.



ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నమూనాను పరిశీలిస్తున్న రైల్వే, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులు

పకడ్బందీగా ఓటరు సర్వే

ఆదోని రూరల్: ఓటరు జాబితా ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. శనివారం ఆమె తన చాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా సవరణపై సమావేశం నిర్వహించి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారన్నారు. కుటుంబంలోని సభ్యులందరూ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ వలస వెళ్లిన కుటుంబాల ఓట్లను పరిశీలించాలని, ప్రతి ఓటరు ఓటు నమోదు చేసుకునేలా, ఓటుహక్కు వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని తహసీల్దార్‌కు విన్నవించారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అల్లాబకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాదరావు, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టిప్రకాష్, సీపీఎం నాయకులు లక్ష్మన్న, సీపీఐ నాయకులు సుధాకర్, బీజేపీ నాయకులు నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

31 వరకు ఓపెన్ అడ్మిషన్స్

ఆదోని సెంట్రల్: ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ చదివేందుకు ఈ నెల 31 వరకు ఓపెన్ అడ్మిషన్స్ జరుగుతాయని ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతికి 14 ఏళ్లు నిండిన వారు, ఇంటర్మీడియెట్‌కు 15 ఏళ్లు నిండిన వారు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు తీసుకొని అందుబాటులో ఉన్న నెట్ సెంటర్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ముగ్గురికి గాయాలు

మంత్రాలయం: రోడ్డుదాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని కల్లుదేవకుంటలో శనివారం చోటుచేసుకుంది. క్షతగాత్రులు కల్లుదేవకుంటకు చెందిన లక్షమ్మ, బూదూరు కృష్ణ, రాఘవేంద్రలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

రైతులను ఆదుకోవాలి

ఆదోని రూరల్: కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు రాష్ట్రాభివృద్ధిని, రైతుల సమస్యలను గాలికొదిలేశారన్నారు. తమ పార్టీ మాత్రమే ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతోందన్నారు. అందులో భాగంగా ఈనెల 30న ఆదోని నుంచి రాష్ట్ర బస్సు జాతా ప్రారంభమవుతుందన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, అన్నమయ్య, సత్యసాయి, పల్నాడు జిల్లాల మీదుగా నవంబర్ 9న విజయవాడకు చేరుకుని అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు బి.రామాంజనేయులు, పీఎస్.రాధాకృష్ , కె.వెంకటేశులు, లింగన్న, డి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

కౌతాళం: అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని కామవరం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే చెప్పాలను, ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, నాయకులు మహేందర్‌రెడ్డి, వీరసేనరెడ్డి, సర్పంచ్ వసంత, ఎల్ఎల్‌సీ ఏఈ రంగస్వామి, ఆర్‌ఐ రాజశేఖర్, కార్యదర్శి శివప్ప, కౌతాళం మాజీ సర్పంచ్ అవతారం, నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు కృతజ్ఞతలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. గ్రామానికి చెందిన గాజుల దస్తగిరి, శేకున్‌బీలకు పద్నాలుగేళ్ల ఇర్ఫాన్, 12 ఏళ్ల ఇమ్రాన్‌తో పాటు కూతురు సంతానం. అయితే కుమారులిద్దరూ పుట్టుక నుంచే కాళ్లు, చేతులు చచ్చుబడి ఉన్నాయి. చికిత్స కోసం ఉన్న ఆస్తిని పోగొట్టుకున్నా కుమారుల ఆరోగ్యంలో మార్పు లేదు. వీరి పరిస్థితిని గ్రామ నాయకుడు మహేందర్‌రెడ్డి ఇటీవల ఎమ్మిగనూరుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి స్పందించిన ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇద్దరికీ రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేయాలని కలెక్టర్ సృజనను ఆదేశించారు. ఈక్రమంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ప్రదీప్‌రెడ్డి, మహేందర్‌కి ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. జగనన్న ప్రభుత్వంలోనే తమ పిల్లలకు పింఛన్ మంజూరైందని, ఇప్పుడు ఆర్థిక సాయం చేసి మరింత ఆదుకున్నారని, ఆయన మేలు జీవితంలో మరిచి పోలేమని దస్తగిరి, శేకున్‌బీ దంపతులు తెలిపారు.



చిన్నారులతో మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి



నైలాన్ దారం అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ



దుర్గాదేవి రూపంలో ఫారెస్ట్‌లైన్ అంబాభవానీదేవి



నవధాన్యాలతో దర్శనమిస్తున్న పేట వీరభద్రేశ్వరస్వామి



దుర్గాదేవి రూపంలో ఎంఎం కాలనీ మాతాపరమేశ్వరిదేవి



నగరేశ్వరస్వామి ఆలయంలో..



వాసవీ ఆలయంలో ఉత్సవమూర్తికి వన దుర్గాదేవి అలంకార దృశ్యం

దుర్గాదేవీ.. పాహిమాం!



కొబ్బరి తురుము, వెన్నతో సరస్వతి అలంకారంలో షరాఫ్‌బజార్‌లోని మహంకాళిదేవి

ఆదోని అర్బన్: దశసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అందులో భాగంగా ఆదోని పట్టణంలోని మహాయోగి లక్ష్మమ్మవ్వను నైలాన్ దారం అలంకరణలో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

మంత్రాలయం: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు శనివారం లలితాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి అర్చకుడు గౌతమ్‌స్వామి నేతృత్వంలో ఫల, పుష్ప, మంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవీదేవి ఆలయంలో అమ్మవారు కాళరాత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చుకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణలు గావించారు. వెండికవచ అలంకరణలు, ఫల, పుష్పాలంకరణలు గావించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దేవి పురాణం వినిపించారు.

కౌతాళం: మండల కేంద్రంలో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకరణలో అలంకరించి పూజలు నిర్వహించారు. లను మహిళలు చేపట్టారు. పంచాకృష్ణ జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చౌడేశ్వరిదేవి ఆలయంలో, ఈరన్న కట్టవద్ద ఉన్న మహంకాళి దేవి ఆలయం వద్ద, శివారులో వెలసిన ఆదిబసవేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేపట్టారు.



మంత్రాలయంలో దుర్గామాతకు పూజలు నిర్వహించిన వై.సీతారామిరెడ్డి,



కాళరాత్రి దేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు



కౌతాళంలో పూజలందుకుంటున్న అమ్మవారు